
# శ్రీమతి సంగీతం



= రచవ: శ్రీ దివాకర్ల సన్యాసిరాజు =

'లచివమ్మగోరూ! కసిన్ని కాఫీనీళ్ళిస్తారా! అలా బయట కెళ్లొస్తా!' మెల్లగా అన్నాను మా శ్రీమతి లక్ష్మితో.

'ఒక్క క్షణం ఆగండి. ఎసరు మరుగుతోంది' అంటూ లోనికెళ్ళి అయిదు నిముషాల్లో కాఫీ కప్పు అందించింది నవ్వుతూ.

అడిగిన వెంటనే కాఫీ అందించేసరికి ఆశ్చర్యానుమానాలు కలిగాయి నాకు—రెండోసారి కాఫీ కోసెత్తితే 'మీకు మరేం పనీ పాటూ లేదా ఏమిటి? ఇరవై నాలుగ్గంటలూ కాఫీయేనా' అనేది. యివాళ లేచిన విశేషం ఏమిటో మరి. 'ఏమిటి సంగతన్నట్లు' చూశాను ఆమెవైపు.

'ఎవండీ...మరేమో......మన పక్కింటి పిన్నిగారమ్మాయి సంగీతం నేర్చుకుంటోంది' అంది నా పక్కన కూర్చుంటూ.

'అయితే' అన్నాను అర్థంకాక.

'మరి నేనుకూడా నేర్చుకుంటానండీ. ఆ సంగీతం టీచరు ఇంటికొచ్చి నేర్పిస్తుందట. చాలా మంచావిడ.'

'నీకు అంతా మంచివాళ్ళలాగే కన్పిస్తారు... అయినా నువ్విప్పుడు సంగీతం నేర్చుకోవడమేమిటి?'

'బాగుందండి. ఇప్పుడు కాకపోతే మరెప్పుడు నేర్చుకుంటారండీ! మా నాయనమ్మ యిద్దరు మనవలు పుట్టిన తరువాత నేర్చుకుంది. ఎంత చక్కగా పాడుతుందనుకున్నారూ...అబ్బ!!'

'నువ్వుకూడా అప్పుడే నేర్చుకోకూడదా' అన్నాను వాళ్ల నాయనమ్మను వూహిస్తూ.

'భలేవారండీ. చేతికందిన అవకాశం జారవిడిస్తే మళ్ళీ లభిస్తుందా? ఆవిడ డిప్లొమా హోల్డరండీ. చాల నెమ్మదైన మనిషి. కొడుకులూ, కూతుళ్ళూ ఆమెని ఆదరించకపోతే వంటరిగా వుండి తన బ్రతుకు తాను నడుపుకుంటోంది.

'నెలకు పది రూపాయలు...చాలట...రేపటినుండి రమ్మన్నానండీ...' అంది లక్ష్మి మెల్లగా.

'సరే నీయిష్టం. కాని నేను ఇంట్లో వున్నప్పుడు మాత్రం పెట్టకామేళం. సంగీతం... నేనూ ఉత్తర దక్షిణ ధృవాలం' అన్నాను.

'అలాగేనండీ. మధ్యాహ్నం పూట చెప్పమంటాను' అంటూ ఖాళీ కప్పు పట్టుకొని లోపలికి పోయింది సంతోషంగా.

నేను రోడ్డెక్కాను—మా ఆవిడ సంగీతం నేర్చుకుంటే ఎలా పాడుతుందో వూహించుకుంటూ.

× × ×

ఒకనాటి సాయంత్రం నేనింటికొచ్చేసరికి ఎవరిదో ఒక డొక్కు హార్మనీ మా యింట్లో ప్రత్యక్షమయింది. ముట్టుకుంటే వూడిపోయేలా వున్నాయా రీడ్సు బహుశా మా నాయనమ్మ వయస్సుంటుందేమో దానికి.

రాత్రి భోజనం చేసి ఏదో నవల చదువుకొంటున్నా. మా ఆవిడ సంగీత సాధన మొదలుపెట్టింది.

'సా...రీ...' అని మా ఆవిడ అంటే—

'గా...మా...' అంటూందా హార్మనీ!

'లక్ష్మీ! ఒకసారిలా వస్తావా' అన్నాను.

'ఆగండీ...వచ్చేసిందివాళ పాఠం...' అంటూమళ్ళీ మొదలుపెట్టింది.

నేరకపోయి నేర్చుకోమన్నావ్రా భగవంతుడా! అనుకొంటూ......లైటార్పి దుప్పటి ముసుగు పెట్టుకొన్నాను.

మా ఆవిడ సంగీతంలో లీనమైపోయి నా సంగతి మరచిపోయింది. ఆ సంగీతం టీచరు లక్ష్మిని మంచిచేసుకొని రాత్రిపూట మకాం మా యింట్లోకి మార్చింది.

తెల్లవారుఝామున నాల్గు గంటలకి సాధన చేస్తే గాత్రం బాగా అలవడుతుందట. అందుకని నాలుగ్గంటలకి వాచీ అలారం పెట్టి స్టవ్ అంటించి, రెండుగ్లాసుల కాఫీ—సంగీతం టీచరుకీ, తనకీ పెట్టుకు తాగి మరో అరగంట డొక్కు హార్మనీ శ్రుతిచేసి ఆ సంగీతం అమ్మగారు 'చెంతనురానురా...' అంటే మా శ్రీమతిగొంతెత్తి 'పంతమేల పోరా...' యిదీ వరస.

వాళ్ళతోపాటు నేను కూడా రోజూ చెక్క భజన చేస్తున్నాను.

ఎలాగయితే నేం మా ఆవిడ దార్లో కొస్తోంది. లక్ష్మి కంఠం వెయ్యి కోయిలలు దాగి వున్నాయని సంగీతం టీచరు నిరూపిస్తోంది.

మరో రెండు నెలలయ్యేసరికి శ్రీమతి సంగీతం పెట్టె కొనమని గారాబం చెయ్యడం మొదలుపెట్టింది.

ఆ సంగీతం పెట్టె ధర్మమా అని నాకు రెండు పూటలూ నాకు నచ్చే టిఫిన్లూ – పండగరోజులా పిండి వంటలూ – అవన్నీ నన్ను ప్రసన్నం చేసుకోవడానికే అయినా – నేను మాత్రం వుబ్బి తబ్బిబ్బయ్యాను.

అలాగే కొంటా నంటూ మరో వారం రోజులు గడుపుకొచ్చాను.


'శ్రీ బాలసుబ్రమణ్యం'

BMF

## పంపులు - మోటార్లు

శ్రేష్ఠమైన లోహాలతో, పనితనంలో అనుభవంగల నిపుణులచే తయారుచేస్తున్నాము

: విశేషాంశాలు :

* స్వల్ప విద్యుచ్ఛక్తితో అధికంగా మంచి నీళ్ళు.
* ఎక్కువ కాలం మన్నికకు నమ్మకమైనవి.
* నిశ్శబ్దంగా పరుగు.
* శ్రేష్ఠమైన తయారి.
* ఖర్చులో తక్కువ.



మా సామాను గ్యారంటి గలవి.

BMF మోటారులనే ఉపయోగించి అధికమైన లాభం పొందండి.

తయారుచేయువారు :—

## బాలసుబ్రమణ్య ఫౌండరీ.

పటేల్ రోడ్ (Phone No. 4313) కోయంబత్తూరు.

ఆంధ్రప్రదేశ్ ఏజెంట్లు:—

అసోసియేటెడ్ ట్రేడర్స్ (దక్కన్) రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ (ఎ. పి.)

ఆ రోజు ఆదివారం. నా గదిలో కూర్చుని ఏదో రాస్తున్నాను.

‘ఏవండోయ్! ఒక్కసారిలా రండి.’

పానకంలో పుడకలా పిలిచేసరికి విసుగెత్తి ‘నువ్వే రాకూడదూ’ అంటో అరిచాను.

‘అబ్బ! ఏం చేస్తున్నారండీ! ఒకసారిలా రండి!’ అంది మళ్ళీ.

యింకెవరికైనా చెప్పొచ్చు గాని లక్ష్మికి మాత్రం చెప్పలేం. తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు. కాదు రెండన్నా నాలుగని ఒప్పించడం నా తరం కాదు.

ఏదో మొగుడు కదా! తనకంటే పెద్దవాడు కదా! రెండాకులు ఎక్కువే చదివాడు కదా! అన్నో యిన్నో కథలు రాశాడు కదా! చిన్నదో పెద్దదో ఓ ఉద్యోగం వెలగబెడుతున్నాడు- కదా! అన్నింటికన్నా తనని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు కదా - అనే యింగిత జ్ఞానం నయాపైసంతయినా లేదే! ముచ్చటగా మూడో సారి పిలిచాక-

‘అబ్బబ్బ! ఎందుకూ...’ అంటూ రాస్తోన్నది మధ్యలో ఆపి వెళ్ళాను.

‘ఏంవిటూ రాచకార్యాలు చక్కబుడుతున్నారా గదిలో కూర్చొని - యివాళ సంగీతం అమ్మగారు వంట చేసింది, ఆవిడ ఎవరికో పాఠం చెప్పడానికి వెళ్ళింది. మీరు వడ్డించుకుని తినేయండి... నే నింట్లోకి రాను.’ అంది చల్లగా నవ్వుతూ.

‘ఉద్ధరించావ్ గానీ...’ అవిడ్నెందుకు వండమన్నావ్? నేను వంట చెయ్యలేనా - లేక నా వంట నీకు నచ్చదా?’ అన్నాను.

‘నేనూ అలాగే అన్నానండీ- ఆయన బ్రహ్మాండంగా వండుతారూ - క్రిందటి జన్మలో నలమహారాజు ప్రియ శిష్యులూ, మీ కెందుకండీ అంత శ్రమ అంటే! అదేంటమ్మాయ్! నే నుండగా ఆయనెందుకూ చేతులు కాల్చుకోవడం, ఆపాటి సాయం చెయ్యడానికి తగనా- బ్రాహ్మణులం - సగోత్రీయులం’ - అందావిడ.

‘క్రిందటి జన్మలో వంటవాడినని కూడా అన్నావా? అంటావులే ... మొగుడంటే నీ కేమైనా గౌరవం మర్యాదా వుందా! యిలాగే చెడిపోతున్నారీ కాలం ఆడపిల్లలంతా! దుష్ట సహవాసాలు చేసి—అయినా నిన్నని ఏం లాభం లే...’

‘అబ్బ అప్పుడే కోపం వచ్చిందా శ్రీవారికి. మీరు ఎంత...గొప్పవారైనా అలా చాటిస్తా నండీ...’

ఆ సంగీతం టీచరంటే మొదట్నించీ నాకు సదభిప్రాయం లేదు. అందుకేనేమో, ఆవిడ వంట కూడా నాకు రుచించలేదు.

లక్ష్మి మాత్రం ‘కూర చాలా బాగుంది కదండీ. పులుసులో అన్నీ సరిగ్గా పడ్డాయి కదండీ...’ అంటూ ఆరగించింది.

రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల ఉదయం ఎంతకీ తెలివి రాలేదు.

‘ఏవండీ...ఏవండోయ్...’ అంటూ లక్ష్మి అరుస్తుంటే బద్ధకంగా లేచి పైకొచ్చాను.

వీధి తలుపులు బారుగా తెరిచి వున్నాయ్.

‘సంగీతం టీచరు ఎక్కడికో వెళ్ళినట్లుంది. మీరు వెళ్ళి కాఫీ నీళ్లు పెట్టండి’ అంది లక్ష్మి.

‘చిత్తం’ అంటూ వంటింట్లోకి వెళ్ళే సరికి, వున్న బద్ధకం కాస్త పూర్తిగా వదిలిపోయింది.

రెండు వెండి కంచాలూ, వెండి మర చెంబు, నాలుగు స్టీలు గిన్నెలు, రాత్రి నేను పెట్టిన చోటునుండి మాయమయ్యాయి.

‘లక్ష్మి!!?’ అంటూ కేక పెట్టాను.

‘ఏంటండీ! ఏమైందీ??’ అంటూ ఆత్రతగా గది గుమ్మంలోకి వచ్చేసింది లక్ష్మి.

‘వెండి పళ్ళాలూ, వెండి చెంబు, స్టీలు గిన్నెలూ సంగీతం అమ్మగారితో లేచిపోయాయి’ అన్నాను తల పట్టుకొని.

‘ఆం!!...’ అంటూ నిలువు గుడ్లేసింది లక్ష్మి.

